క్లుప్తంగా

స్వామివారి సన్నిధిలో నూతన ఆర్డీవో

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో మంగళవారం అమలాపురం నూతన ఆర్డీవోగా బాధ్యతలు తీసుకున్న జి.కేశవర్ధన్‌రెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రిలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని సూపరింటెండెంట్ పి.విజయ సారథి అందజేశారు. తహసీల్దార్ వై.రామకుమారి, డీటీ సీహెచ్ భాస్కర్, వీఆర్వో బి.సీతారామం పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలి

కొత్తపేట: నియోజకవర్గంలో నవంబర్ 6న జరిగే వైఎస్సార్ సీపీ సామాజిక సాధికారత బస్సు యాత్రలో దళితులంతా పాల్గొని విజయవంతం చేయాలని అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని అవిడిలో వారు విలేకరులతో మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా న్యాయం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా జరుగుతున్న ఈ యాత్రలో లబ్ధి పొందిన అందరూ వేలాదిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఈతకోట హేమసుందరరాజు, సభ్యులు తెన్నేటి దిలీప్, ఉప్పటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మలికిపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రధానోపాధ్యాయిని చింతా బాల చింతామణి అన్నారు. సఖినేటిపల్లిలంక హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయిని ఏపీఎన్‌సీ కోర్డినేటర్ గుండేపల్లి ప్రభావతి ఆధ్వర్యంలో మంగళవారం విశ్వేశ్వరాయపురం ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని చింత బాల చింతామణి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి పాఠశాల ఆవరణలో బాదం, దానిమ్మ, బొప్పాయి, వేప, గోరింట, మందారం, తమలపాకు, వాము మొక్కలు నాటారు. మొక్కలు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని, మనకు ఆక్సిజన్‌ని అందిస్తాయని ఆమె విద్యార్థులకు వివరించారు. మొక్కలను పెంచుదాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ విద్యార్థులతో నినాదాలు చేయించారు.

వైద్యానికి సాయం అందజేత



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీఅన్నపూర్ణాదేవి సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందిన అనంతరం మరోమారు శస్త్రచికిత్స అవసరమైన బాధితుడికి స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.11 వేల ఆర్థిక సాయం అందజేశారు. రావులపాలెం శివారు చిన్నవారిపాలెంకి చెందిన కోట సీతారామస్వామికి గత నెలలో రోడ్డు ప్రమాదం జరిగి తలకు గాయం కావడంతో ఆపరేషన్ చేయించారు. సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చయింది. అయినా పూర్తిగా కోలుకోకపోవడంతో మళ్లీ ఆపరేషన్ చేయించాలని వైద్యులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి అంత స్తోమత లేక దాతల సాయం కోరారు. దీంతో స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు అతడి ఇంటికి వెళ్లి రూ.11 వేల సాయాన్ని అందజేశారు.

అన్నదమ్ములుగా కలసి ముందుకు వెళదాం

కొత్తపేట: నియోజకవర్గంలో కుల, మత, వర్గాలకు అతీతంగా అందరం అన్నదమ్ముల భావంతో కలసి మెలసి ముందుకు వెళదామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. సంస్థాగతంగా వైఎస్సార్ సీపీ అభివృద్ధిలో భాగంగా ఇటీవల మండలంలోని గ్రామ శాఖల అధ్యక్షులను నియమించారు. దానిలో భాగంగా అవిడి గ్రామ శాఖ అధ్యక్షుడిగా శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన రెడ్డి సుభాష్‌కు మళ్లీ పట్టం కట్టారు. అయితే సుభాష్ తండ్రి, గ్రామ సర్పంచ్ రెడ్డి చంటి సూచన మేరకు స్వచ్ఛందంగా తప్పుకుని, ఎస్సీ సామాజిక వర్గానికి ఇద్దామని వారు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆ మేరకు పార్టీకి నిబద్ధతతో పనిచేస్తున్న యడ్ల నరేష్ పేరును సూచించారు. దానికి జగ్గిరెడ్డి ఆమోదం తెలిపారు. నరేష్‌ను గ్రామ శాఖ అధ్యక్షుడిగా ప్రకటించి, పూలమాల, శాలువాతో అభినందించారు. మళ్లీ జగన్‌ను సీఎంగా చేయడానికి అందరం సమైక్యంగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రెడ్డి చంటి, గ్రామ పార్టీ మాజీ అధ్యక్షుడు రెడ్డి సుభాష్, పీఏసీఎస్ పర్సన్ నామాడి రాజారత్నం, హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్, వివిధ సామాజిక వర్గాల నాయకులు పాల్గొన్నారు.

మందు గుండు సామగ్రి సీజ్

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన బుర్లే రాంబాబు ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన మందుగుండు సామగ్రిని సీజ్ చేసినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. నిందితుడు రాంబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆరోగ్య సురక్ష.. పేదలకు శ్రీరామరక్ష

- గ్రామాల్లో జోరుగా వైద్య పరీక్షలు
- శిబిరాన్ని వినియోగించుకోవాలని నేతల పిలుపు



ఏనుగులమహల్ సురక్ష శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న దేవిడ్‌రాజు తదితరులు



దేవరపల్లి సురక్ష శిబిరంలో మందులు అందజేస్తున్న జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు

కొత్తపేట: మండలంలోని ఏనుగులమహల్ గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని అముడా చైర్మన్ డేవిడ్‌రాజు ప్రారంభించారు. తహసీల్దార్ జీడీ కిశోర్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో డేవిడ్‌రాజుతో పాటు ఎంపీపీ మార్గన గంగాధర రావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సురక్ష శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యులతో పాటు పలువురు స్పెషలిస్టులు, వైద్య సిబ్బంది వివిధ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సేవాదళ్ అధ్యక్షుడు జి.ప్రవీణ్‌కుమార్, మండల మహిళా విభాగం కన్వీనర్ పోతుల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కత్తిమండలో..

మలికిపురం: మండలంలోని కత్తిమండ యూపీ స్కూల్‌లో మంగళవారం ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ ఆరేటి రంగనాయకులు మాట్లాడుతూ సీఎం జగన్ విద్య, వైద్యంపై ప్రత్యేకశ్రద్ధతో పాటు అందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేసి అందరికీ సమన్యాయం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిట్టాల వీవీ సత్యనారాయణ, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కె.వెంకట్రావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, కొల్లు వెంకటేశ్వరరావు తోలేటి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో..

రావులపాలెం: ఆరోగ్య సురక్ష శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం దేవరపల్లి పంచాయతీ వద్ద సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు అధ్యక్షతన జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ క్యాంపులో 365 మందికి వైద్య సేవలు అందించినట్టు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకట్రావు, ఎంపీటీసీ కుడుపూడి దుర్గాలక్ష్మి, ఉప సర్పంచ్ నామన లక్ష్మీ మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

చింతలపల్లిలో..

రాజోలు: చింతలపల్లి గ్రామ సచివాలయం–2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ మట్టా ప్రసన్న కుమారి ప్రారంభించారు. శిబిరానికి విచ్చేసిన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ మట్టా శైలజ, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రపురంలో..

పి.గన్నవరం: మండలంలోని నరేంద్రపురం–2 గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ బీర వెంగమాంబ ప్రారంభించారు. వైద్యాధికారుల ఆధ్వర్యంలో 288 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావు దొర వైద్య శిబిరాన్ని పరిశీలించారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ ఎం.భారతి, సొసైటీ చైర్మన్ మెల్లం మహాలక్ష్మి, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే చెప్పండి.. పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



అవిడిలో మహిళా లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



అవిడిలో ప్రధానమైన సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: అమ్మా.. మీ కుటుంబానికి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు వచ్చాయి. ఆర్థిక ప్రగతి చేకూరింది సరే.. ఇంకా ఏమైన సమస్యలు ఉన్నాయా? అని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ప్రజలను ప్రశ్నించారు. మండలంలోని అవిడి గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా వివిధ పథకాలు పొందిన లబ్ధిదారులు జగ్గిరెడ్డికి సాదరంగా స్వాగతం పలికారు. ఆయా లబ్ధిదారులకు వర్తించిన పథకాలను జగ్గిరెడ్డి వారికి వివరిస్తూ ఆ బుక్‌లెట్‌ను అందచేశారు. ఆయా లబ్ధిదారులు సీఎం జగన్, మీ పుణ్యమా అని మాకు అన్ని పథకాలు అందాయని.. ఆర్థిక ఇబ్బందులు లేకుండా ముందుకు వెళుతున్నాం.. అంటూ వారు అభిమానం వ్యక్తం చేశారు. ఇలా ప్రతి ఇంటా సంతోషాన్నే సీఎం జగన్ కోరుకున్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని జగ్గిరెడ్డి ప్రశ్నించారు. చెప్పినవి చెప్పినట్టుగా మాకు ఎన్నో ఉపకారాలు చేశారు. ఇంకా సమస్యలేముంటాయని బదులిచ్చారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబంలో ఆర్థిక వెలుగు కల్పించడమే సీఎం జగన్ లక్ష్యమని, జగన్ నాయకత్వంలో మనందరి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుని అందరూ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే సీఎం ఆకాంక్ష అని అన్నారు. వీధి వీధినా స్థానికులు ఘనస్వాగతం పలికారు.

సీసీ రోడ్లు, డ్రైన్లు ప్రారంభం

గ్రామంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కృషితో ప్రభుత్వ నిధులు రూ.35 లక్షలతో నిర్మించిన అవిడి నుంచి గంటి పెదపూడి వెళ్లే సీసీ రోడ్డు, స్థానిక గ్రామ పంచాయతీ నిధులు రూ.35 లక్షలతో నిర్మించిన పలు ఇంటర్నల్ సీసీ రోడ్లు, డ్రైన్లను జగ్గిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఏఎంసీ చైర్మన్ రెడ్డి రవీదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యులు దూళి సూరిబాబు, నేతల వెంకటలక్ష్మి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ నామాడి రాజారత్నం, పల్లి దిలీప్, గ్రామ పార్టీ అధ్యక్షుడు యడ్ల నరేష్, మండల సేవాదళ్ అధ్యక్షుడు జీపీ తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో వైభవంగా కలశాల పూజ



అప్పనపల్లిలో కలశ పూజలో పాల్గొన్న స్వాములు

మామిడికుదురు: అప్పనపల్లిలో అయ్యప్పస్వామి 18 కలశాల పూజ వైభవంగా జరిగింది. తటవర్తి లక్ష్మీనారాయణ స్వగృహం వద్ద జరిగిన కలశాల పూజలో భారీ సంఖ్యలో స్వాములు పాల్గొన్నారు. ముందుగా మేళతాళాలు, బాణసంచా కాల్పులతో స్వాములు పేటతుళ్లి ఆడుతూ వైనతేయ గోదావరి నదికి ఊరేగింపుగా వెళ్లారు. పెదపట్నం గ్రామానికి చెందిన జయంతి సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో వినాయకుడు, సుబ్రహ్మణ్యుడు, కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం మానేపల్లికి చెందిన కాలిశెట్టి ప్రకాశ్‌గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప గీతామృతం మంత్రముగ్ధుల్ని చేసింది.

రైతులతో ఆర్డీఓ సమీక్ష



రైతులతో చర్చిస్తున్న ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి

మామిడికుదురు: జాతీయ రహదారితో పాటు బైపాస్ రోడ్డుకు సంబంధించిన పలు అంశాలపై అమలాపురం ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి మంగళవారం పాశర్లపూడికి చెందిన రైతులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు తీసుకున్న వారికి పరిహారం చెల్లింపులో తేడాలు ఉన్నాయని రైతులు వాపోయారు. కొందరికి సెంట్ల రూపంలో, మరికొందరికి గజాల రూపేణా పరిహారం ఇచ్చారని చెప్పారు. భూములు కోల్పోతున్న వారికి అందరికి గజానికి రూ.5 వేలు వంతున పరిహారం ఇవ్వాలని కోరారు. కట్టడాల తొలగింపులో సగం భవనానికి మాత్రమే పరిహారం ఇస్తున్నారని ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. మిగిలిన సగం కట్టడం దెబ్బతింటున్నందున మొత్తం కట్టడానికి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బైపాస్ రోడ్డు కోసం 54 మంది రైతుల నుంచి 7.70 ఎకరాలు సేకరించారు. వారిలో 10 మందికి 1.98 ఎకరాలకు పరిహారం చెల్లించారు. 44 మందికి 5.71 ఎకరాలకు పరిహారం ఇవ్వాల్సి ఉందని తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ తెలిపారు. జాతీయ రహదారి విస్తరణకు 307 మంది నుంచి 5.58 ఎకరాలు సేకరించామన్నారు. 154 మందికి పరిహారం అందించామని, 153 మందికి పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. రైతులు, నిర్వాసితుల అభిప్రాయాలను తెలుసుకున్నానని వాటిని జేసీ నూపుర్ అజయ్, కలెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తీసుకు వెళ్తానని ఆర్డీఓ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో పురోభివృద్ధి చెందాలి



వక్కలంకలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

అంబాజీపేట: తక్కువ పెట్టుబడులతో ఎక్కువ పంటలను ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు సాధించి ఆర్థిక పురోభివృద్ధి చెందాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ జె.ఎలియాజర్ అన్నారు. వక్కలంకలో పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాల ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తలు, మెంటర్‌లు గుత్తుల ధర్మారావు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని మాస్టర్ ట్రైనర్ జనిపల్లి నాగవేణి అధ్యక్షతన మంగళవారం సందర్శించారు. ప్రాజెక్ట్ మేనేజర్ ఎలియాజర్ మాట్లాడుతూ పర్యావరణానికి, ఆరోగ్యానికి హాని కలగకుండా నాణ్యమైన ప్రకృతి సేద్య పంటలను పండించేలా రైతులు చైతన్యం కావాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా రైతులు ఆర్థికంగా ఎదగడమే కాకుండా భూమికి సారవంతమైన ఎరువును అందిస్తారన్నారు. ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర స్థాయి పరిశీలకుడు ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధాన పద్ధతులను పాటించడం ద్వారా చిన్న సన్నకారు రైతులు ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. వ్యవసాయాధికారి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సహజ సిద్ధమైన పంటలు పండించేలా రైతులు ఆలోచనలు చేయాలన్నారు. అంతకుముందు కొబ్బరి, కోకో తోటల్లో కూరగాయల సాగు, తదితర పండించే పంటలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ చంద్రరాజు రైతు క్షేత్ర పాఠశాల గురించి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి ట్రైనీలు వై.నీరజ, సీహెచ్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలను సందర్శించిన డీఎల్‌డీఓ

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి–1, వెలువలపల్లి సచివాలయాలను డీఎల్‌డీఓ మందా ప్రభాకరరావు మంగళవారం సందర్శించారు. సచివాలయ రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం అయినవిల్లి–1 సచివాలయం పరిధిలో నిర్మాణం ఆగిన సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. సంపద కేంద్రం నిర్మాణానికి కలెక్టర్‌కు నివేదికలు సమర్పించాలని నిధులు మంజూరు సహకరిస్తానన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, పంచాయతీ కార్యాదర్శి రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

రైతులకు 'ఉద్యాన' శిక్షణ

పి.గన్నవరం: అఖిల భారత వన్య తోట పంటల సమన్వయ పథకం, ఎస్సీ ఉప ప్రణాళిక పథకాల్లో భాగంగా అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎన్‌బీవీ చలపతి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వై.కొత్తపల్లిలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొబ్బరి, కోకో పంటల సాగులో జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా 32 మంది రైతులకు కొబ్బరి మొక్కలు, జీవ నియంత్రణ కారకాలను అందజేశారు. కార్యక్రమంలో తెగుళ్ల నివారణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త వి.గోవర్ధనరావు, మండల ఉద్యాన అధికారి ఎం.దిలీప్‌కుమార్, ఆర్బీకే ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు పాస్టర్స్ ఆత్మీయ సమ్మేళనం

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి పాస్టర్స్ ఆత్మీయ సమ్మేళనం గురువారం ఉదయం 10 గంటలకు అంబాజీపేట మార్కెట్ యార్డులో నిర్వహించనున్నట్లు క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ కె.బాబురావు తెలిపారు. ఈ సమ్మేళనానికి అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, రాష్ట్ర మైనార్టీ సెల్ చైర్మన్ ఎం.జాన్సన్ పాల్గొననున్నారు.

విజయవంతమైన జగనన్న ఆరోగ్య సురక్ష

ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



సఖినేటిపల్లి మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

సఖినేటిపల్లి: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్యులు, అధికారుల కృషితో విజయవంతమైనట్టు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గతంలో పేదల ఆరోగ్యంపై ఇంతటి అంకిత భావతంతో పనిచేసిన ప్రభుత్వం కూడా లేదని ఆయన తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లికార్జునరావు అధ్యక్షతన పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా మాట్లాడుతూ, ప్రజల వద్దకే పాలన నిమిత్తం సీఎం జగన్ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారన్నారు. అలాగే వివిధ పథకాలు సకాలంలో అందేలా వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. జేజేఎంలో అంతర్వేది చెరువు సమగ్ర రక్షిత తాగునీటి రిజర్వాయర్‌గా రూపుదిద్దుకుంటోందన్నారు. సమావేశంలో ఎంపీడీవో జి.భీమారావు శాఖల వారీగా రివ్యూ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ, జగనన్న స్వచ్ఛ సంకల్పంలో ప్రతి ఒక్కరూ భాగస్వామం కావాలన్నారు. ఎంఈవో–1 డి.కిషోర్ కుమార్ విద్యారంగంలో ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక మార్పులను గురించి వివరించారు. ఈ దశలో గుడిమూల సర్పంచ్ దెందుకూరి శ్రీహరి రాజు మాట్లాడుతూ, ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం పిల్లల ట్రాన్స్‌పోర్ట్ విషయంలో నిబంధనలు పాటించడం లేదని, 48 మంది పిల్లలు ఎక్కాల్సిన వ్యాన్‌లో 70 వరకూ పిల్లలు ఉంటున్నారని ఎంఈవో దృష్టికి తీసుకు వెళ్లారు. వ్యాన్‌లను అధికారుల చెక్ చేయాలని ఎంఈవోను సర్పంచ్ కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారికి ఫోను ద్వారా తగిన ఆదేశాలు ఇచ్చారు. తొలుత భారతదేశానికి ఐక్యతా స్ఫూర్తిని నింపిన సర్దార్ వల్లభాయి పటేల్ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద ఎమ్మెల్యే, పలువురు ప్రజాప్రతినిధులు సమావేశంలో నివాళులర్పించారు. రాజోలు ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, స్థానిక సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, తహసీల్దార్ వై.రామ కుమారి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

పి.గన్నవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థినులకు బాల్య వివాహాలపై ఐసీడీఎస్ సీడీపీఓ వై.విజయశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ఆమె అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

ఆత్రేయపురం: హౌసింగ్‌లో ఎవరైతే ఇళ్లు కట్టలేదో వారికి అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ నాతిబుజ్జి సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. జగనన్న కాలనీలో సోక్‌పిట్స్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వి.వెంకటరెడ్డి, ఏపీఓ విజయభారతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన జగన్‌తోనే సాధ్యం



అంతర్వేదిపాలెంలో మహిళకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

సఖినేటిపల్లి: అవినీతి లేని పారదర్శక పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం అంతర్వేదిపాలెంలో ఎమ్మెల్యే రాపాక, తనయుడు వెంకట్ రామ్‌తో కలసి అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమంలో గత ప్రభుత్వాలకు, ప్రస్తుత ప్రభుత్వానికి ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో నిర్వహిస్తున్న సీఎం జగన్‌కు తిరిగి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ మందపాటి రత్నం, కోఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు ఈద రవిరెడ్డి, నల్లి సురేంద్రరావు, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, ఉపాధ్యక్షురాలు పెదపాటి నాగలక్ష్మి, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ నల్లి మోహన్, నాయకులు నల్లి త్రిమూర్తులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

ఆలమూరు: శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని మండలంలోని పెదపళ్లలో మంగళవారం భారీ అన్నసమారాధన జరిగింది. స్థానిక పోలేరమ్మ ఆలయ ఆవరణలో నెలకొల్పిన దుర్గాదేవి అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు గ్రామస్తుల సహకారంతో పిండివంటలతో సుమారు ఐదు వేల మందికి ఈ అన్నసమారాధనను నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అన్నదానాన్ని స్వీకరించారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

అంబాజీపేట: ఎస్సీ వర్గీకరణకు ఈ నెల 18న నిర్వహించనున్న చలో హైదరాబాద్ సభను విజయవంతం చేయాలని జిల్లా ఎంఎస్పీ అధ్యక్షుడు యార్లగడ్డ సత్తిబాబు పిలుపునిచ్చారు. అంబాజీపేట బస్ స్టేషన్ వద్ద ఉన్న డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద చలో హైదరాబాద్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతీ ఎంఆర్పీఎస్ సోదరుడు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసి హైదరాబాద్ సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉందుర్తి నాగబాబు, చట్టుగుళ్ల రాంబాబు, కొండేటి నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయం రూ.52,350

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయం రూ.52,350 లభించింది. స్థానిక ఆలయ ముఖ మండపంలో ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజు పర్యవేక్షణలో ఆలయంలోని తొమ్మిది హుండీలను దేవదాయశాఖ అధికారులు, పాలకవర్గ సభ్యులు లెక్కించారు. అందులో భాగంగా ఆ ఆదాయం లభించినట్లు ఈఓ పేర్కొన్నారు.

వైఎస్సార్ జగనన్న లేఅవుట్ల పరిశీలన

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో సుమారు 17.5 ఎకరాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌ను సర్పంచ్ గుణ్ణం రాంబాబు, తహసీల్దార్ ఐపీ శెట్టి మంగళవారం పరిశీలించారు. రహదారుల నిర్మాణం, సరిహద్దు రాళ్ల ఏర్పాటుపై స్థానిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు లబ్ధిదారులకు త్వరలో పంపిణీ చేయనున్న ఈ స్థలాల్లో త్వరితగతిన మౌలిక సదుపాయాలు కల్పించాలని సర్పంచ్ రాంబాబు కోరారు. గ్రామ కార్యదర్శి కె.మోక్షాంజలి, వీఆర్‌ఓ దార్ల అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం



సంధిపూడిలో రైతులకు ప్రభుత్వ విధానాలను వివరిస్తున్న ఆర్డీవో ముక్కంటి

ఆలమూరు: ఖరీఫ్‌లో పండించిన ప్రతీ గింజను కనీస గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతులకు అన్ని విధాలా సహాయ, సహకారాలను అందిస్తామని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు మాసూళ్లు చేసిన ధాన్యాన్ని సత్వరమే రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించుకుని అధిక ధరను పొందాలని సూచించారు. వారం రోజుల వ్యవధిలోనే కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు జరిపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తహసీల్దార్ ఐపీ శెట్టి, ఏఓ ఎస్.లక్ష్మీలావణ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

అంబాజీపేట: బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి, లైన్స్ క్లబ్, రెడ్‌క్రాస్ సభ్యుడు బెహరా హనుమంతరావు సమకూర్చిన నిత్యవసారలను పారిశుద్ధ్య కార్మికులకు, ఆరుగురు లెప్రసీ వ్యాధిగ్రస్తులకు సర్పంచ్ జల్లి బాలరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. పుల్లేటికుర్రులో విలేజ్ హెల్త్ క్లినిక్‌లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మంత్రిప్రగడ వెంకట సుబ్బారావు జయంతిని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రవికుమార్, రాధా నరసింహం, హెల్త్ అసిస్టెంట్ ఏపీ ప్రసాద్‌బాబు, ఎంఎల్‌హెచ్‌పీ షైనా, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కీర్తి సేవా పురస్కారం అందుకున్న చిట్టిబాబు

సఖినేటిపల్లి: స్థానిక సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు మంగళవారం అమలాపురంలో జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా చేతుల మీదుగా కీర్తి సేవా పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు డొక్కా సీతమ్మ ఇన్‌స్పిరేషనల్ అవార్డు 2023 కార్యక్రమంలో కలెక్టర్ పై పురస్కారాన్ని ఆయనకు ఇచ్చారు. గ్రామంలో సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కినట్టు సర్పంచ్ చిట్టిబాబు అన్నారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం

రాజోలు: యాలంగి సుమిత్ రామారావు ట్రస్ట్ సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. మంగళవారం సుమిత్‌రామారావు జయంతి నిర్వహించారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ గంజి అనంతం అధ్యక్షతన జరిగిన సమాశేంలో పలువురు మాట్లాడుతూ న్యాయవాది యాలంగి రమేష్ తనయుడు కార్పొరేట్ కళాశాల ఒత్తిడికి గురై ప్రాణాలు కోల్పోయాడన్నారు. విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా పాఠాలు బోధించాలని రైతు నాయకుడు బోనం నాగేశ్వరరావు అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు, ఇంగ్లీషు నిఘంటువులు అందజేశారు. న్యాయవాదులు మాకే దేవీ వరప్రసాద్, బొంతు రాంబాబు, గొల్లమందల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.